క్లుప్తంగా

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

అవేర్ సంస్థల చైర్మన్ మాధవన్‌జీ



కొత్తూరు గ్రంథాలయంలో మాధవన్‌జీ

కందుకూరు: గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అవేర్ సంస్థల చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తూరులోని సామాజిక గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రంథాలయాలు రేపటి తరాలకు, నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలు అందజేస్తామన్నారు. అందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్, సభ్యులు రాజేశ్, సలహాదారు ఎల్.శేఖర్ పాల్గొన్నారు.

ఎంవీఎస్ఆర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం ఇస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పీవీ నర్సింహారావు చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ సహకారంతో కళాశాలలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 250 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, డీన్లు, హెచ్‌ఓడీలు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



వీరేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న విశ్వనాథ్‌గౌడ్

పహాడీషరీఫ్: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేసిన తూళ్ల వీరేందర్‌గౌడ్‌కు బుధవారం బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరైన ఆయనకు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌గౌడ్ మాట్లాడుతూ.. కొత్త కార్యవర్గం నియామకంతో పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజం కలుగుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రారావు నేతృత్వంలో రాబోయే ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయికిరణ్‌గౌడ్, మహేశ్‌యాదవ్, రవితేజ, అనిల్‌గౌడ్, రాజుచారి, దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురంలో డీసీ పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న డీసీ

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని గడ్డమీద రెండు గుళ్లు ఉన్న ప్రాంతంలో పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం గురించి కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎల్బీనగర్ సర్కిల్ డీసీ మల్లికార్జునరావు పర్యటించారు. కాలనీవాసుల సౌకర్యార్థం పార్కును అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని డీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, ఆలయ కమిటీ చైర్మన్ నగేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై చెత్తకుప్పలు

మలక్‌పేట: ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్న వ్యర్థాలతో దుర్గంధంగా మారుతున్నాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా జీహెచ్ఎంసీ, వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్‌శాఖ తొలగించిన చెట్ల కొమ్మలు ఎక్కడ చూసిన కుప్పలుగా పేరుకుపోయాయి. కురుస్తున్న వర్షాలకు అవి కుళ్లిపోయి క్రిమికీటకాలు, దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చెట్ల కొమ్మలు, వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.



శ్మశానవాటికలోని స్నానాల గదులు



ప్రహరీ లేని ఆవరణ

ప్రహరీకి మోక్షమెప్పుడు?

వివాదాల్లో నాదర్‌గుల్ శ్మశానవాటిక

- దహన సంస్కారాల సమయంలో స్థానికుల బెంబేలు
- పరిష్కారమార్గం చూపాలని విజ్ఞప్తి

బడంగ్‌పేట్: శ్మశానవాటికకు ప్రహరీ లేకపోవడంతో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌వాసులు దాదాపు పదేళ్లుగా అవస్థలు పడుతున్నారు. నగర పంచాయతీగా ఉన్న సమయంలో మొదలు పెట్టిన పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. దీనికితోడు మరో వివాదం సైతం పనులకు అడ్డంకిగా మారింది. అన్ని శ్మశానవాటికలు ప్రభుత్వ స్థలాల్లో ఉంటే ఇది మాత్రం పట్టాభూమిలో ఉంది. దీంతో సదరు యజమానులు శ్మశానవాటికలో కొంత భూమి కావాలని డిమాండ్ చేయడంతో సమస్య తీవ్రమైంది. దీనిపై గ్రామస్తులు, మున్సిపల్ అధికారులు పలు దఫాలుగా చర్చించినా ఫలితం లేకుండా పోయింది. పట్టణీకరణలో భాగంగా శ్మశానవాటిక చుట్టుపక్కల గృహాలు వెలిశాయి. దహనసంస్కారాల సమయంలో ప్రహరీ లేకపోవడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు.

గతంలో రూ.40 లక్షలు మంజూరు

శ్మశానవాటికకు ప్రహరీ లేకపోవడంతో నగర పంచాయతీ ఉన్న సమయంలోనే రూ.40 లక్షలు మంజూరు చేశారు. శ్మశానవాటిక స్థలం ప్రైవేట్‌ది కావడంతో యజమానులు కొంత స్థలం కావాలని డిమాండ్ చేయడంతో పనులు ఆపేశారు. మంజూరైన నిధుల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి కొంత ప్రహరీని నిర్మించారు. యజమానులు కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిచాయి. స్థల యజమానులతో మాట్లాడి శ్మశానవాటిక ప్రహరీని నిర్మించి, సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు శ్మశానవాటికలో అంత్యక్రియలు చూడటానికి వచ్చినవారికి కూర్చునేందుకు వెయిటింగ్ హాల్, అస్థికలు భద్రపరిచేందుకు రూమ్, దింపుడుగల్లెం, దహనం చేసేందుకు మండపం, స్నానాల గదులున్నాయి. సరిపడా వాటర్ సౌకర్యం ఉంది.

త్వరలో నిర్మిస్తాం



ప్రహరీ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు అయ్యాయి. గతంలో కొంత వివాదం జరిగిన మాట వాస్తవమే. ఎప్పుడో ఈ స్థలాన్ని శ్మశానవాటికకు ఇచ్చారు. త్వరలోనే ప్రహరీ నిర్మిస్తాం. సౌకర్యాలు కల్పిస్తాం. నాదర్‌గుల్ గ్రామస్తులంతా నిర్ణయానికి వచ్చారు.

– శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్

వేతనాలు మంజూరు చేయాలంటూ వినతి



కందుకూరులో ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందిస్తున్న క్షేత్ర సహాయకులు

కందుకూరు: ఉపాధి హామీ పథకంలో పనిచేసే క్షేత్ర సహాయకులకు(ఎఫ్ఏలు) వెంటనే వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎఫ్ఏలకు గత మూడు నెలలుగా వేతనాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం దసరా పండుగ వస్తుందని, కుటుంబ పోషణకు ఆర్థికభారం ఇబ్బందిగా ఉందన్నారు. మరోపక్క కూలీలకు డబ్బులు అందక పనులకు రావడం లేదన్నారు. దీంతో తమపై ఒత్తిడి అధికమైందన్నారు. వెంటనే తమకు అందాల్సిన బకాయిలు విడుదల చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఏల సంఘం మండల అధ్యక్షుడు పాపగళ్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి బండ వెంకటేశ్, ఏఫ్ఏలు సత్యం, టి.నర్సింహ, శేఖర్, ఎం.యాదయ్య, ఎస్.రాములు, బి.రవి, వై.నర్సింహ, ఎం.రాములు, కె.పెంటయ్య, పి.గణేశ్, ఏ.రాజేందర్, నర్సింహ, యాదయ్య, జ్యోతి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు దోహదం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సీతారామ్

కందుకూరు: నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని సీఐ సీతారామ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని మాలగూడూరులో స్థానికులు చిలుకల ఆంజనేయులు, బండి సత్తయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాలతో నేరం జరిగినా వెంటనే నిందితులను గుర్తించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది నిఘాతో సమానమన్నారు. గ్రామంలో యువత పెడదారిన పట్టకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్లు మల్లేశ్, మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

కల్యాణం.. కమనీయం



స్వామివారిని దర్శించుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

- వైభవంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తులు, నాయకులు
- తగిన ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

పహాడీషరీఫ్: మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం కనుల పండువగా జరిగింది. ఉదయం బాలభోగము, హవనము, బలిహరణం అనంతరం ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. 12 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి తిరు కల్యాణాన్ని జరిపించారు. ఈ కల్యాణ మహోత్సవంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించగా.. గ్రామస్తులు స్వామివారికి హారతి సమర్పించారు. గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, వీహెచ్‌పీ నేత శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ క్లాం నరేశ్‌గౌడ్, కమిటీ సభ్యులు చెన్నయ్య, శేఖర్, అనిత, భాస్కర్, రాధిక, మాజీ చైర్మన్ బండారి గోపాల్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవిగా అమ్మవారు



మీర్‌పేట: రాఘవానగర్ కాలనీలో..



తుక్కుగూడ: అన్నపూర్ణదేవిగా అమ్మవారు

- మూడోరోజు అమ్మవారికి ఘనంగా పూజలు
- పాల్గొన్న భక్తులు, నాయకులు



తుక్కుగూడ: శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం వద్ద హోమం చేస్తున్న భక్తులు

మహేశ్వరం: మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరి దేవాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు మూడోరోజు ఘనంగా నిర్వహించారు. శ్రీ అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అన్నపూర్ణదేవి హోమం మంత్ర పుష్పతీర్థం, హోమపూజ చేశారు. అనంతర భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాతలు తిప్పిరెడ్డి అనితమధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ధర్మకర్తలు మోదిని రాకేశ్, జి.నరేశ్, ఒగ్గు శంకర్, పాతర్ల తిరుపతయ్య, ఏపూరి సాయిలు, కనగట్ల శ్రీశైలం, అర్చకులు వీరేశం, రాజు, ఆలయ ఈఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ: మంఖాల్ మహంకాళి, రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు మూడోరోజు బుధవారం భక్తులకు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయంలో హోమం నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: అన్నపూర్ణదేవి అలంకరణ



మహేశ్వరం: అన్నదాన కార్యక్రమం

వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: కొత్తపేట డివిజన్ బృందావన్ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కాలనీలో ఉన్న ఆరు అంతర్గత రోడ్లలో రెండు రోడ్లలో మాత్రమే డ్రైయిన్స్ సదుపాయం ఉందని మిగిలిన వాటిలోనూ డ్రైయిన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓపెన్ జోన్ విషయంలో గతంలో సంబంధించిన మంత్రితో మాట్లాడడం జరిగింది ఎవరు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని అన్నారు. అలాగే నూతన డ్రైయిన్స్, స్తంభాల గురించి అధికారులచే మాట్లాడి పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల రాహుల్ గౌడ్, యాదగిరి, యాసిన్, జోగు నాగేష్, అనిల్, బాలాజీ, కరుణాకర్, శ్రీనివాస్, కాలనీవాసులు శ్రీనివాస్‌యాదవ్, రాకేశ్, సతీశ్, శేఖర్, దీపక్, రాజేష్, సాయి, అరుణ్, శివ, రసూల్, వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగనివ్వను

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: ట్రిపుల్‌ఆర్ రోడ్డు విషయంలో రైతులకు అన్యాయం జరగనివ్వనని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాటలు నమ్మి రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ట్రిపుల్‌ఆర్ దక్షిణభాగం రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని వివరించారు. ట్రిపుల్ ఆర్ ప్రతిపాదన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిందని దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపిందని గుర్తుచేశారు. కల్వకుర్తి ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

రూ.15 కోట్ల మంజూరు

ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం టీఎఫ్‌యూడీఐసీ ద్వారా రూ.15 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటికే రూ.32 కోట్లతో మంచినీటి పనులను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం రూ.10 కోట్లతో నిర్మించే రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఈ నెల 25న ఎంపీ మల్లు రవితో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శంకర్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జగన్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

నాగోలు: తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా ఎల్బీనగర్ చెందిన పెద్దవూర బ్రహ్మయ్యను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో భూమి, భుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన రైతంగా పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవాలు ఈ నెల 26న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. ఆమె స్ఫూర్తితో రజక యువత మహిళలు పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన మహిళకు రిమాండ్

నాగోలు: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లో దూరి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన మహిళలను నాగోలు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫతుల్లాగూడ సర్వేనెంబర్-58కి చెందిన స్రవంతి కూరగాయల దుకాణం నడుపుతుంది. సమీపంలో ఉండే ధూళిపాళ ధనలక్ష్మి తరచూ స్రవంతి వద్ద వచ్చి మాట్లాడేది. ఒంటరిగా ఉంటున్న విషయం తెలుకున్న స్రవంతి మంగళవారం ముఖానికి ముసుగు ధరించి ఆమె మెడలో ఉన్న తులం బంగారు గొలుసు లాక్కొని ఆమె నోటికి ప్లాస్టర్ వేసి పారిపోయింది. సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు బుధవారం స్రవంతిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మాక్బూల్ జానీ తెలిపారు.

ఎర్రకుంట దోబీఘాట్‌ను అభివృద్ధి చేయాలి



దోబీఘాట్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సైదాబాద్: సైదాబాద్ ఎర్రకుంట దోబీఘాట్‌ను శుభ్రపరచి అభివృద్ధి చేయాలని మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ కోరారు. బుధవారం ఆయన పలువురు బీజేపీ నాయకులతో కలిసి దోబీఘాట్‌ను పరిశీలించి మాట్లాడారు. గతంలో ఎర్రకుంట వద్ద పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో చేరి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించే వారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇక్కడ నిలబడే పరిస్థితి కూడా లేకపోవటం బాధాకరమన్నారు. పాతబస్తీలోని పలు ప్రాంతాల నుంచి సేకరిస్తున్న చెత్తా చెదారాలను జీహెచ్ఎంసీ సిబ్బంది తీసుకొచ్చి ఇక్కడ డంపింగ్ చేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి దోబీఘాట్ అభివృద్ధిపై చొరవ తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టులు సమాజానికి మార్గ నిర్దేశకులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

తుర్కయంజాల్: జర్నలిస్టులు సమాజానికి మార్గ నిర్దేశకులని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు అన్నారు. ఈ నెల 26వ తేదీన మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులో నిర్వహించనున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, దర్శన్, టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు సిలివేరు యాదగిరి, కార్యదర్శి జగన్, జర్నలిస్టులు మణికుమార్, యాదయ్య, కుమార్, దేవరాజ్, ఉపేందర్, కార్తక్, మల్లేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.